సామాన్యులకు అర్థమయ్యే రీతిలో శ్రీశ్రీ కవిత్వం

చిక్కడపల్లి: శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ) కవిత్వం సామాన్యులకు అర్థమయ్యే రీతిలో ఉంటుందని ఎస్వీ యూనివర్సిటీ మాజీ వీసీ ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. చిక్కడపల్లి త్యాగరాయ గానసభ నిర్వహణలో బుధవారం నిర్వహించిన శ్రీశ్రీ జయంతిలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇనాక్ మాట్లాడుతూ... సామ్యవాద భావనలు, అభ్యుదయ ఆలోచనలతో శ్రీశ్రీ రచించిన మహాప్రస్థానం ప్రపంచ సాహిత్య చరిత్రలో అత్యంత చైతన్యవంతమైనదని అన్నారు. సినీ గేయ రచయితగా అత్యుత్తమ గీతాలను అందించారని తెలిపారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనామూర్తి అధ్యక్షత వహించిన కార్యక్రమంలో సుబ్రమణ్యం, గుండవరపు గీత, సంఘసేవకురాలు దేవసేన తదితరులు పాల్గొన్నారు.

గొప్ప ఆదర్శ రాజకీయవేత్త మద్దికాయల ఓంకార్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: గొప్ప ఆదర్శ రాజకీయ నాయకులు మద్దికాయల ఓంకార్ అని హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి. చంద్రకుమార్ అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలోని ఓంకార్ భవన్‌లో ఎంసీపీఐ(యూ) ఆధ్వర్యంలో మద్దికాయల ఓంకార్ శతజయంతి వార్షికోత్సవ లోగోను చంద్రకుమార్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాలలో చెరగని ముద్రవేశారని అన్నారు. శాసనసభలో ఓంకారి పాత్ర నేటి రాజకీయాలలో అందరికి ఆదర్శనీయమని అన్నారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం అలుపెరగని పోరాటం చేశారన్నారు.

చిక్కడపల్లి డీఐ బదిలీ

చిక్కడపల్లి: హైదరాబాద్ నగరంలో ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ సీపీ సీవీ ఆనంద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. చిక్కడపల్లి డీఐగా ఉన్న శేఖర్‌ను జుబ్లీహిల్స్ అడిషనల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ చేశారు. తుకారం గేట్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా పనిచేస్తున్న శంకర్ మలోత్‌ను చిక్కడపల్లి డీఐగా బదిలీ చేశారు.

వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా నిరసన

ముషీరాబాద్: కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ బోర్డుకు వ్యతిరేకంగా తీసుకువచ్చిన కొత్త చట్టాన్ని వ్యతిరేకిస్తూ ముషీరాబాద్, భోలక్‌పూర్‌లోని మసీదులలో ముస్లింలు నిరసన వ్యక్తం చేశారు. ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపు మేరకు బుధవారం సాయంత్రం బడీ మసీదు, బిలాల్ మసీదు, గుల్షన్‌నగర మసీదు తదితర ప్రాంతాలలో ముస్లింలు విద్యుత్ దీపాలను ఆర్పేసి నిరసన వ్యక్తం చేశారు. అంతకు ముందు ముస్లిం మతపెద్దలు, బీఆర్ఎస్ నాయకులు అక్లాక్‌హుస్సేన్, మహ్మద్ అలీ, మున్వర్‌చాంద్, సబీల్‌అహ్మద్ తదితరులు ఇంటింటికీ వెళ్లి ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆదేశాలకు అనుగుణంగా నిరసన వ్యక్తం చేయాలని విజ్ఞప్తి చేశారు.

దైవభక్తికి నిదర్శనం లింగాయత్‌లు

ముషీరాబాద్: దైవభక్తి, సమాజ మార్పునకు నిదర్శనం లింగాయత్‌లు అని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. బుధవారం వీరశైవ లింగాయత్ సమాజం ముషీరాబాద్ కమిటీ ఆధ్వర్యంలో మహాత్మా బసవేశ్వర జయంతి కార్యక్రమాన్ని ముషీరాబాద్ చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బసవేశ్వరస్వామి సమాజ సేవకు ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. వీరశైవ లింగాయత్ సమాజం రాష్ట్ర కమిటీ సలహాదారులు ఆర్.విశ్వేశ్వర్, శివశరప్పాలు, గౌరీశంకర్, ఉపాధ్యక్షులు శివకుమార్, కళ్యాణ్ పాల్గొన్నారు.

మెట్రోరైల్ కార్మికులకు అండగా బీఎంఎస్

చిక్కడపల్లి: మెట్రోరైల్‌లో పని చేస్తున్న కార్మికులకు న్యాయం జరిగే వరకు బీఎంఎస్ అండగా నిలుస్తుందని ప్రముఖ కార్మిక నాయకుడు మహేష్ ఖండాలే, బీఎంఎస్ అనుబంధం ప్రధాన కార్యదర్శి సచిన్ మెంగలే అన్నారు. మెట్రో కాంట్రాక్ట్ కార్మికుల న్యాయమైన డిమాండ్లపై సీనియర్ మేనేజ్‌మెంట్‌తో చర్చలు జరిపుతామన్నారు. పెండింగ్ వేతనాలు, ప్రావిడెంట్ ఫండ్, బోనస్‌లు, మెడిక్లెయిమ్, ఇతర హక్కుల కోసం పోరాడాలన్నారు. కార్మికులపై అన్యాయంగా వ్యవహరిస్తే ప్రతిఘటిస్తామని తీర్మానించారు. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను బీఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి కేవీ రాధాకృష్ణ ఆర్టీసీక్రాస్ రోడ్స్‌లోని బీఎంఎస్ కార్యాలయంలో బుధవారం వివరాలు వెల్లడించారు.

రైతులకు రాజ్యాంగ హక్కులను కల్పించాలి

కవాడిగూడ: రాజ్యాంగబద్ధంగా రైతులకు హక్కులు కల్పించాలని రైతుకు వ్యాపారితో సమానంగా హక్కులు కల్పించాలని రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు ఎం.భీమయ్య, ప్రధాన కార్యదర్శి ఆర్ఆర్ అల్వార్‌రెడ్డి డిమాండ్ చేశారు. రైతులకు రాజ్యాంగబద్ధంగా హక్కులను కల్పించాలని వ్యాపారితో సమానంగా హక్కులు కల్పించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఇందిరాపార్కు వద్ద రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. అసైన్‌మెంట్ చట్టం, ఆర్ఓఆర్ చట్టం సీలింగ్ యాక్ట్, ఆర్టీఐ యాక్ట్ చట్టాలను ధిక్కరించిన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

తగ్గేదేలే..!

- పదో తరగతి ఫలితాల్లో సత్తాచాటిన సర్కారు బడి విద్యార్థులు
- కార్పొరేట్, ప్రైవేటుకు దీటుగా ఫలితాలు సాధించి ప్రభంజనం
- మేము ఎవరికీ తీసిపోమని నిరూపించిన ప్రభుత్వ బడి విద్యార్థులు
- చదువుకు పేదరికం అడ్డుకాదని ఈ ఫలితాలే నిదర్శనం
- ముషీరాబాద్ మండలంలో మెత్తం 94 శాతం ఉత్తీర్ణత
- జమిస్తాన్‌పూర్ పాఠశాలలో 100శాతం ఉత్తీర్ణత నమోదు


భార్గవి (554) చరణ్‌తేజ (552) వి.లక్ష్మి (548) ఏ.వైష్ణవి (537) సీహెచ్.వర్ష (533) అనుష్క (532) గోవింద్ (504)

ముషీరాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ప్రకటించిన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సత్తాచాటారు. కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ఫలితాలు సాధించి ప్రభంజనం సృష్టించారు. తాము ఎవరికీ తీసుపోమని మరోసారి నిరూపించిన సర్కారు బడి విద్యార్థులు. చదువుకు పేదరికం అడ్డుకాదని ఈ ఫలితాలే నిరూపిస్తున్నాయని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. విద్యార్థులు మంచి ఫలితాలు సాధించడంతో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ముషీరాబాద్ మండలంలో 94 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. మండలంలోని ఏడు ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 329మంది పరీక్ష రాయగా అందులో 308 మంది ఉత్తీర్ణత సాధించారు.

రాంనగర్‌లో వంద శాతం ఉత్తీర్ణత...

జమిస్తాన్‌పూర్(రాంనగర్) ప్రభుత్వ పాఠశాలలో 17 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 17 మంది విద్యార్థులు(100 శాతం) ఉత్తీర్ణులయ్యారు. నల్లకుంట ప్రభుత్వ పాఠశాలలో నుంచి 29కి గాను 28 మంది (97 శాతం) ఉత్తీర్ణత సాధించారు. సీతాఫల్‌మండి ప్రభుత్వ పాఠశాల నుంచి 60 మందికి గాను 58 మంది (97 శాతం) మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. మాణికేశ్వర్‌నగర్ నుంచి 28 మందికి గాను 26 మంది(93 శాతం) ఉత్తీర్ణత సాధించారు. జామై ఉస్మానియా పాఠశాల నుంచి 69 మందికి గాను 64 మంది (93 శాతం) ఉత్తీర్ణులయ్యారు. కవాడిగూడ ప్రభుత్వ పాఠశాల నుంచి 49 మందికి గాను 45 మంది(92 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ముషీరాబాద్ పాఠశాల నుంచి 77 మంది విద్యార్థులకు గాను 70 మంది (91 శాతం) ఉత్తీర్ణులయ్యారు. రాంనగర్ పాఠశాల మొదటిస్థానంలో నిలవగా ముషీరాబాద్ పాఠశాల చివరి స్థానంలో నిలిచింది.

మండల టాపర్ భార్గవి...

చదువుకు పేదరికం అడ్డురాదని తమకు అవకాశాలు కల్పిస్తే నిరూపించి చూపుతామని పేద విద్యార్థులు తమ ఫలితాలతో నిరూపించారు. బుధవారం ప్రకటించిన పదో తరగతి ఫలితాల్లో నల్లకుంట ప్రభుత్వ పాఠశాలకు చెందిన భార్గవి(554/600) మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచారు. అదే పాఠశాలకు చెందిన చరణ్‌తేజ (552) మార్కులు సాధించి ఔరా అనిపించారు.

- జామై ఉస్మానియా ప్రభుత్వ పాఠశాలకు చెందిన అఖిల(551), నల్లకుంట ప్రభుత్వ పాఠశాలకు చెందిన వి.లక్ష్మి(548) మార్కులు సాధించి శభాష్ అనిపించుకున్నారు. ఇక మాణిక్యేశ్వర్‌నగర్ పాఠశాలకు చెందిన ఏ.వైష్ణవి(537), ముషీరాబాద్ పాఠశాలకు చెందిన అనుష్క(532), కవాడిగూడకు చెందిన సి.హెచ్.ఉమాదేవి(513), ముషీరాబాద్ పాఠశాలకు చెందిన గోవింద్(504) మార్కులు సాధించి తమ ప్రతిభను చాటుకున్నారు.


రెయిన్‌బో అనాథాశ్రమానికి చెందిన విద్యార్థిని కృతిమ(498)ను సత్కరిస్తున్న డీఈఓ శ్రావణ్‌కుమార్, హెచ్ఎం స్వరూపారాణి

- ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల ఆవరణలోని రెయిన్‌బో హోమ్‌కు చెందిన విద్యార్థులు ఎనిమిది మంది పరీక్ష రాశారు. అందులో ఎనిమిది మంది ఉత్తీర్ణులు కావడం విశేషం. కృతిమ అనే విద్యార్థిని (498) మార్కులు సాధించి శభాష్ అనిపించుకుంది. వీరిని ముషీరాబాద్ మండల విద్యాశాఖ అధికారి శ్రావణ్‌కుమార్, ప్రధానోపాధ్యాయురాలు స్వరూపారాణి అభినందనలు తెలిపి సత్కరించారు.

అంబర్‌పేట నియోజకవర్గంలో 89.5శాతం ఉత్తీర్ణత


ఉమాదేవి (518)


కుసుమ (487)

అంబర్‌పేట: పదో తరగతి ఫలితాల్లో అంబర్‌పేట నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు సత్తాచాటారు. బుధవారం వెలువడిన ఫలితాల్లో 89.5శాతం ఉత్తీర్ణత నమోదు చేసినట్లు డిప్యూటీ డీఈఓ ఫాతిమా తెలిపారు. 27మంది విద్యార్థులు 500పైగా మార్కులు సాధించినట్లు ఆమె వెల్లడించారు. 567 మార్కులు అత్యధికమని పేర్కొన్నారు. 3 ప్రభుత్వ పాఠశాలల్లో 100 శాతం ఉత్తీర్ణ సాధించామని అన్నారు. గతేడాదిలో పోలిస్తే ఈ ఏడాది మెరుగైన ఫలితాలు సాధించినట్లు ఆమె పేర్కొన్నారు.

కాచిగూడ ప్రభుత్వ పాఠశాలలో 87శాతం ఉత్తీర్ణత

కాచిగూడ: కాచిగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో 87శాతం ఉత్తీర్ణత నమోదయ్యిందని ప్రధానోపాధ్యాయురాలు కె.విజయలక్ష్మి తెలిపారు. గతేడాది 73శాతం ఉత్తీర్ణత సాధించగా ఈసారి ఫలితాల్లో 14 శాతం అధికంగా ఉత్తీర్ణతను సాధించినట్లు ఆమె పేర్కొన్నారు. మొత్తం 60మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా అందులో 52 మంది ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. తెలుగు మీడియంలో 10 మంది పరీక్షలకు హాజరు కాగా అందులో 9 మంది విద్యార్థులు, ఇంగ్లిష్ మీడియంలో 50 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా అందులో 43 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. రానున్న రోజుల్లో మరింత ఉత్తమ ఫలితాలు వచ్చే విధంగా కృషి చేస్తామని ఆమె తెలిపారు.

కవాడిగూడ ప్రభుత్వ పాఠశాలలో 92 శాతం ఉత్తీర్ణత

కవాడిగూడ: కవాడిగూడ ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి పరీక్ష ఫలితాలలో 92 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రభుత్వ పాఠశాల ప్రిన్సిపల్ మీనాకుమారి తెలిపారు. పాఠశాల నుంచి మొత్తం 49 మంది ఇంగ్లిష్ మీడియం విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, 45 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. పాఠశాలలో అత్యధిక మార్కులు సీహెచ్ ఉమాదేవి 518 మార్కులు సాధించగా, ద్వితీయ స్థానంలో కుసుమ 487 మార్కులు సాధించినట్లు ఆమె తెలిపారు. గత సంవత్సరం పాఠశాల నుంచి 59 విద్యార్థులలో ఇంగ్లిష్ మీడియం నుంచి 52 మంది, తెలుగు మీడియం నుంచి ఏడుగురు పరీక్షలకు హాజరై 78 శాతం ఉత్తీర్ణత సాధించారని ఆమె తెలిపారు. పాఠశాలలో తెలుగు మీడియం విద్యార్థులు ఎవరు లేకపోవడంతో తెలుగు మీడియం ఎత్తి వేసినట్లు ఆమె తెలిపారు.

జీవితానికి పరీక్షలు ప్రామాణికం కాదు

డాక్టర్ హిప్నో పద్మకమలాకర్

చిక్కడపల్లి: జీవితానికి పరీక్షలు ప్రామాణికం కాదని ప్రొగ్రెసివ్ సైకాలజిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షురాలు డాక్టర్ హిప్నో పద్మకమలాకర్ అన్నారు. బుధవారం పదో తరగతి పరీక్ష ఫలితాలు విడుదలైన సందర్భంగా ఆమెతో కలసి అశోక్‌నగర్‌లో మాట్లాడారు. పరీక్ష ఫలితం ఎలా వచ్చినా ధైర్యంగా ఉండాలన్నారు. విద్యార్థుల్లో పెరుగుతున్న మానసిక ఒత్తిడితో బాధపడుతున్నారని తెలిపారు. పరీక్షలో ఫెయిల్ అయితే జీవితమే ఓటమి చెందినట్లుగా చూడకూడదన్నారు. తల్లిదండ్రులు తక్కువ మార్కులు వస్తే ఇతరులతో పోల్చి చూడొద్దని సూచించారు. గొప్ప వ్యక్తులు చదువులో వెనుకబడినా ధృడ సంకల్పంతో సహకారమని అన్నారు. పిల్లలు వైఫల్యం చెందితే దండించడం మానెయ్యాలని సూచించారు. పరీక్ష ఫలితాలు ఒక ప్రయత్నమేనని అన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ హిప్నో పద్మకమలాకర్, లయన్ జయశ్రీ

సమగ్ర కులగణన నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం

కాచిగూడ: దేశ జనాభా గణనలో సమగ్ర కులగణన చేపట్టాలని కేంద్ర కేబినెట్ బుధవారం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం అన్నారు. కులగణనకు పూర్తి మద్దతు ఉంటుందని, సామాజిక న్యాయం, సమతా స్థాపన దిశగా ఇదొక గొప్ప ముందడుగని ఆయన పేర్కొన్నారు. బుధవారం కాచిగూడలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... 1931 తర్వాత దేశ చరిత్రలో ఇదే తొలిసారి కేంద్రం కులగణనపై స్పష్టమైన ప్రకటన చేసిందన్నారు. దేశంలోని అనేక వర్గాలకు ఈ నిర్ణయంతో న్యాయాన్ని చేకూర్చనుందని తెలిపారు. సమాజంలోని వాస్తవిక పరిస్థితులను పసిగట్టి, సముచిత ప్రాతినిధ్యం కల్పించే మార్గాన్ని ఇది తెరిచినట్టేనని అన్నారు.

- ప్రస్తుత పరిస్థితుల్లో దేశంలో సుమారు 55శాతం జనాభా ఓబీసీలుగా ఉన్నారనే అంచనాలున్నా వారి స్థితిగతులపై అధికారిక గణాంకాలు లేవన్నారు. ఈ నేపథ్యంలో కులగణన వాస్తవాలు వెలుగులోకి రానున్నాయని తెలిపారు. ఈ నిర్ణయం ద్వారానే ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిజమైన లబ్ధిదారుల వరకు చేరే అవకాశం ఉందన్నారు. నిస్సందేహంగా ఇది సామాజిక సమతా సాధనలో మైలురాయిని అన్నారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం తరపున ప్రధాని మోదీకి, కేంద్రమంత్రివర్గానికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. కులగణన కోసం దేశం వేచి చూసిన దశాబ్దాల నిరీక్షణకు కేంద్ర ప్రభుత్వం తెరదించిందన్నారు.

'కుల గణన' చరిత్రాత్మక నిర్ణయం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: దశాబ్దాల కుల సంఘాల, బీసీ సంఘాల ఉద్యమ ఫలితంగా కులగణన చేపట్టాలని కేంద్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్లు గౌడ ఐక్యసాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు అంబాల నారాయణ్ గౌడ్ తెలిపారు. ఈ విషయంలో ప్రధాని నరేంద్రమోదీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకమైనదని పేర్కొన్నారు. కులగణన వల్ల దేశంలో బీసీల సమగ్ర ఆర్థిక, సామాజిక, రాజకీయ, విద్య, ఉద్యోగ, ఉపాధి, సాంస్కృతిక, పేదరిక సమాచారం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ఇది కులాల సమగ్ర అభివృద్ధికి పునాది పడుతుందన్నారు.

ప్రపంచ సుందరి పోటీలను రద్దు చేయాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: 72వ ప్రపంచ సుందరి పోటీలను రద్దు చేయాలని మిస్ వరల్డ్ అందాల పోటీల వ్యతిరేక పోరాట వేదిక డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా పోరాట వేదిక ప్రతినిధులు బుధవారం రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్ నేరళ్ల శారదకు వినతి పత్రం సమర్పించారు. అందాల పోటీలు మహిళా సాధికారతకు సంకేతం కాదన్నారు. ఈ పోటీలను ప్రభుత్వం నిర్వహించడం సరైనది కాదని పేర్కొన్నారు. మహిళల వ్యక్తిత్వాన్ని కించపరిచే మిస్ వరల్డ్ పోటీలను ప్రభుత్వం రద్దు చేయాలని కోరారు.

డ్రైనేజీ పైపులైన్ పనులు ప్రారంభం

ముషీరాబాద్: నూతన డ్రైనేజీ పైపులైన్ పనులను బుధవారం ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ ప్రారంభించారు. కొన్ని రోజులుగా స్థానికులు విజ్ఞప్తి మేరకు ఉన్నతాధికారులతో మాట్లాడి నిధులను మంజూరు చేయించినట్లు ఆయన తెలిపారు. రూ.15లక్షలతో ఈ పనులు చేపట్టామని పేర్కొన్నారు. భవిష్యత్‌లో డ్రైనేజీ సమస్య ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, నేత శ్రీనివాస్, కొండపల్లి మాధవ్, శ్యాంసుందర్, సత్యనారాయణ, సయ్యద్ అస్లాం, ముచ్చకుర్తి ప్రభాకర్, రామస్వామి, యూనస్, రాజు, మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

మాకు సమాచారం ఇవ్వరా..?

డ్రైనేజీ సమస్యతో ఏడాదిగా ఇబ్బంది పడుతూ స్థానికులు ఆందోళన చేపట్టారని.. రాంనగర్, ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహించి అధికారుల దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లామని స్థానికుడు శ్రీను నాయుడు తెలిపారు. కానీ డ్రైనేజీ పైపులైన్ పనులు ప్రారంభిస్తున్నప్పుడు తమకు సమాచారం ఇవ్వకపోవడం ఏమిటని అధికారులతో వాగ్వాదానికి దిగారు.


డ్రైనేజీ పైపులైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

పెండింగ్ పనులకు నిధులు మంజూరు చేయాలి

ముషీరాబాద్: భోలక్‌పూర్ డివిజన్‌లో దశాబ్ద కాలంగా పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేసి సమస్యలు పరిష్కరించాలని హైదరాబాద్ జిల్లా డెవలప్‌మెంట్ కమిటీ సభ్యుడు నందగిరి నర్సింహ కోరారు. భోలక్‌పూర్ డివిజన్‌కు చెందిన వివిధ పార్టీల నాయకులతో కలిసి ఆయన బుధవారం జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్‌కు వినతిపత్రం అందజేశారు. ఇందిరానగర్‌లో అంబేడ్కర్ కమ్యూనిటీహాల్ నిర్మాణం పూర్తి చేయకుండా అలాగే వదిలేశారని లేఖలో పేర్కొన్నారు. నిధులు విడుదల చేయకపోవడం వల్లే నిర్మాణ పనులు నిలిచిపోయాయని తెలిపారు. రంగానగర్‌లోని ఖాళీ స్థలంలో కమ్యూనిటీహాల్ నిర్మించాలని, అధ్వానంగా మారిన సీసీ రోడ్డును పునర్ నిర్మించాలని కోరారు. ఇటీవల నగర మేయర్ భోలక్‌పూర్‌లో పర్యటించినప్పుడు తమ సమస్యలను వివరించామని గుర్తు చేశారు. ఇప్పటికైనా భోలక్‌పూర్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు చంద్రమోహన్, సత్యనారాయణ, రవికుమార్, ధర్మేందర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.


జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కన్వర్షన్ సమస్య పరిష్కరించే వరకు పోరాడాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: చట్టబద్ధంగా లభించే హక్కుల కోసం ఐక్య పోరాటాలు చేయాలని హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ పిలుపునిచ్చారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ కన్వర్షన్ జేఏసీ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ.. తెలంగాణ విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఆర్టిజన్స్‌కు విద్యార్హతను బట్టి కన్వర్షన్ ఇవ్వాలని కోరారు. ఆ తర్వాతనే జేఎల్ఎం సబ్ ఇంజినీర్, జూనియర్ అసిస్టెంట్, సబార్డినేట్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. కన్వర్షన్ సమస్య పరిష్కరమయ్యే వరకు ఐకమత్యంగా పోరాటం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ కన్వర్షన్ జేఏసీ చైర్మన్ కె. ఈశ్వర్ రావు, కన్వీనర్ ఎంఏ వాజీర్, కో చైర్మన్ జి. నాగరాజు, కె. వెంకటేష్, ఎస్. చంద్రరెడ్డి, కె. లింగం, పి. మురళి తదితరులు పాల్గొన్నారు.